క్లుప్తంగా

సాహితీవేత్తల కృషి అవసరం



డీసీసీబీ చైర్మన్ వీర్రాజును సత్కరిస్తున్న ప్రముఖులు

కడియం: సమాజాన్ని జాగృతం చేయడంలో సాహితీవేత్తల కృషి ఎంతో అవసరమని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి కళా సేవాసమితి అధ్యక్షుడు అడపా సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక నర్సరీలో ఆదివారం కార్తిక వనసమారాధన జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వీర్రాజు మాట్లాడారు. పలువురు సాహితీవేత్తలు నాటక పద్యాలు, కవితలు, గీతాలు ఆలపించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, సెంట్రల్‌జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ డి.రాజ కుమార్, కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్య ప్రసాద్, మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, సహకార బ్యాంకు చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు గంధోత్సవం

సీటీఆర్ఐ: హజరత్ మహబూబ్ సుభానీ బాబా వారి 63వ ఉరుసు గంధోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి వివిధ కార్యక్రమాలు దర్గా నిషానీ సయ్యద్ అమీరున్నీషా ఆధ్వర్యంలో జరిగాయి. ఒంటెలు, గుర్రాలు, మేళాతాళాలు, ఫకీరులతో గంధాన్ని ఊరేగించారు. నెహ్రూనగర్, రాజేంద్రనగర్, వై జంక్షన్ వరకు ఊరేగింపుగా తీసుకుని వెళ్లి తిరిగి దర్గా వద్దకు తీసుకువచ్చారు. గంధ మహోత్సవంలో ముస్లిం, హిందువులు పాల్గొన్నారు. దర్గా అధ్యక్షుడు సయ్యద్ గౌస్ మొహిద్దీన్ గంధాన్ని అందరికీ అందజేశారు. ఎంపీ భరత్‌రామ్, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఎండీ ఆరిఫ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం

రాజమహేంద్రవరం రూరల్: ఇటీవల రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ముద్దాల అను ను ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. సాహితీవేత్త డాక్టర్ గూటం స్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు యెనుముల త్యాగరాజు, వై.ఎస్ కుమార్, ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజయోనా పాల్గొన్నారు

ఫొటోగ్రాఫర్ సత్తిబాబుకు నివాళి

రాజమహేంద్రవరం రూరల్: సీనియర్ ఫొటోగ్రాఫర్, వాసవి స్టూడియో అధినేత పలివెల సత్యనారాయణ (సత్తిబాబు) సంతాప సభ పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని జైహింద్ నగర్‌లో ఆదివారం జరిగింది. ప్రముఖులు పాల్గొని ముందుగా సత్తిబాబు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాజమండ్రి జోన్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ రిలేటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అల్లు బాబీ తదితరులు మాట్లాడుతూ సత్తిబాబు యూనియన్‌కి చేసిన సేవలను కొనియాడారు. గౌరవ సలహాదారులు రావ్ అండ్ రావ్, కేత శ్రీను, అధ్యక్షుడు సిరి శ్రీను, సెక్రటరీ లీలా నాగు, కోశాధికారి ఆషా రాంబాబు, కోఆర్డినేటర్ వాసపల్లి బాబి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఆవిర్భావ వేడుకలు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో ఆదివారం 76వ ఎన్‌సీసీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్జేడీ డాక్టర్ చప్పిడి కృష్ణ మాట్లడుతూ ఎన్‌సీసీ క్రమశిక్షణ కల్గిన, ప్రపంచంలోనే యూనిఫాం వేసుకొని సేవ చేసే అతి పెద్ద వలంటీర్ వ్యవస్థ అన్నారు. తలసైనిక్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులను అదేవిధంగా కళాశాలలో ప్రతిభ చూపిన ఇతర కేడెట్లకు పతకాలను అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఈసుబ్ బాషా షేక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మరమ్మతుల నిమిత్తం నగరంలో సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ ఆదివారం ప్రకటించారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ కలిగే అంతరాయంతో లాలాచెరువు సబ్ స్టేషన్ పరిధిలో సత్తమ్మ తల్లి గుడి ఏరియా, మసీద్ రోడ్డు, వెంకటరామయ్యనగర్, నారాయణపురం, గోపాల్‌నగర్ పుంత, బాబానగర్, ఏవిఅప్పారావు రోడ్‌లలో ప్రభావం ఉంటుందన్నారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ కలిగే అంతరాయంతో మార్కెట్ యార్డ్ విద్యుత్ సబ్–స్టేషన్ పరిధిలోని జయ కృష్ణాపురం, వీరభద్రపురం, ఇన్‌కమ్ టాక్స్ ఆఫీస్, కోరుకొండ రోడ్డు, హరిపురం, సుబ్బరాయపురం, లలిత నగర్, సుభాష్‌నగర్ ఏరియాలలో ప్రభావం ఉంటుందన్నారు.

మోదీ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

ప్రకాశం నగర్ : రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానని, విభజన హామీలు అమలు చేస్తానని తొమ్మిదేళ్ల క్రితం తిరుపతిలో వెంకన్న సాక్షిగా హామీలు గుప్పించిన మోదీ ఆ హామీలను ఏ ఒక్కటి నెరవేర్చ లేదని, ఆయన ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేశారు. ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ,మోదీ తిరుపతి రావడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం ముందు సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

కదలండి.. ఓటరుగా నమోదు కండి

- నగరంలో ఐదు చోట్ల కియోస్కులు
- అవగాహనకు మొబైల్ డిజిటల్ వెహికల్

రాజమహేంద్రవరం సిటీ: 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు కావాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ రాజమహేంద్రవరంలో అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో స్వీప్ (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమానికి నగరంలో ప్రచారం కల్పించడంతో పాటు పలు ప్రాంతాలలో ఓటరు నమోదుకు అవసరమైన కియోస్కులు ఏర్పాటు చేశారు. నగరంలో యువత, కళాశాల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా అర్హత ఉన్న యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. యువతను ఓటర్లుగా నమోదు చేయడం, నైతిక విలువలతో కూడిన ఓటింగ్ వైపు పయనించేలా చైతన్య పరచడం, భాగస్వామ్యం చేయడానికి స్వీప్ ద్వారా సాధించేందుకు నగర పాలక సంస్థ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. కాలేజీ విద్యార్థులపై దృష్టి పెట్టడమే కాకుండా యువతను ప్రభావితం చేసేందుకు డిజిటల్ వాహనం ద్వారా ప్రచారం ప్రారంభించింది. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో 2024 జనవరి 1 నాటికి ఓటు హక్కు లేని యువత లేకుండా చేయడమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోంది.

దరఖాస్తు ఇలా చేసుకోవాలి..

- ఫారం– 6 – 18 ఏళ్లు నిండే యువత ఫారం –6 ద్వారా దరఖాస్తు చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవచ్చు
- ఫారం– 6ఏ– భారతీయ పాస్‌పోర్ట్ కలిగిన విదేశాల్లో ఉన్న భారతీయులు ఫారం 6 ఏ ద్వారా దరఖాస్తు చేసుకుని ఓటు నమోదు చేసుకోవచ్చు.
- ఫారం– 6బి ఓటరు కార్డును ఆధార్ కార్డుకు అనుసంధానం చేసుకునేందుకు ఫారం6 బి ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు



రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్

- ఫారం–7 –మృతి చెందిన వ్యక్తుల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించుకోవడం కోసం ఫారం –7 ద్వారా దరఖాస్తు చేయవచ్చు.
- ఫారం 8– ఓటరు చిరునామా మార్పు, నియోజకవర్గాల మార్పు జరిగితే ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నంబరు 1950కు డయల్ చేసుకునే అవకాశం కల్పించారు.

ప్రస్తుతం నగరంలో ఓటర్లు ఇలా...

ప్రస్తుత నగరంలో ఉన్న ఓటర్ల సంఖ్య 2,56,560, మహిళలు 1,32,275 కాగా పురుషులు 1,24,221 మంది ఇతరులు 64 మంది ఉన్నారు. స్పెషల్



డిజిటల్ క్యాంపెయిన్ వాహనం

సమ్మరీ రివిజన్‌లో భాగంగా సుమారు 60 వేల దరఖాస్తులు అందినట్లు నగరపాలకసంస్థ అధికారులు చెబుతున్నారు. సిటీ నియోజకవర్గంలో 232 పోలింగ్ బూత్‌లు ఉండగా నూత ఓటరు నమోదుకు ప్రతీ బూత్ స్థాయి లెవెల్ ఆఫీసర్ వద్ద నమోదు ఫారాలు, సంబంధిత మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం కల్పిస్తూ చర్యలు చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. ఓటరు నమోదు ఆన్‌లైన్‌లో కూడా చేసుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఓటర్ల నమోదు కార్యక్రమంపై డిసెంబర్ 9 వరకు స్వీప్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

నగరంలో పలు చోట్ల కియోస్కుల ఏర్పాటు

ఓటుహక్కు నమోదుపై విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలనే లక్ష్యంతో నగరంలో రద్దీగా ఉన్న ఐదు ప్రాంతాల్లో కియోస్కులు ఏర్పాటు చేశారు. అవి...

1) పుష్కర్ ఘాట్
2) వై.జంక్షన్
3) నగర పాలక సంస్థ కార్యాలయం
4) గోకవరం బస్టాండ్
5) కోటిపల్లి బస్టాండ్

ఓటరుగా నమోదు కావాలి



అర్హత ఉన్న యువతీ యువకులు ఓటరుగా నమోదు కావాలి. నగరంలో ఐదు చోట్ల కియోస్కులు ఏర్పాటు చేశాం. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకూ యువతకు అవగాహన కల్పించేందుకు వీటిని ఏర్పాటు చేశాం. ఈ కార్యక్రమం డిసెంబరు 9 వరకూ నిర్వహిస్తాం. యువత నైతిక విలువలతో కూడిన ఓటింగ్ వైపు దృష్టి సారించేలా అవగాహన కల్పిస్తున్నాం.

– దినేష్‌కుమార్, కమిషనర్, నగర పాలక సంస్థ

కళాశాల యువతపై ప్రత్యేక దృష్టి



నగరంలో పలు కళాశాలల్లో చదివే విద్యార్థులు ఓటరుగా నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించడంతో పాటు చర్యలు చేపట్టాం. యువతకు అవగాహన కల్పించేందుకు డిజిటల్ క్యాంపెయిన్‌లో భాగంగా వాహనాన్ని సిద్ధం చేశాం. నగరంలో ఏ ఒక్కరూ మిగలకుండా ఓటరుగా నమోదు చేసేందుకు కృషి చేస్తున్నాం.

– డాక్టర్ వినూత్న, ఎంహెచ్ఓ

విశ్వ నగరంగా రాజమహేంద్రవరం



మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరంను విశ్వ నగరంగా తీర్చిదిద్దాలన్నదే తన కోరిక అని ఎంపీ మార్గాని భరత్‌రామ్ వెల్లడించారు. ఆదివారం నగరంలోని జేఎన్ రోడ్డు ఆంధ్రకేసరి జూనియర్ కళాశాల మైదానంలో రాజమహేంద్రవర నగర బ్రాహ్మణ కార్తిక సమారాధన'ను జిల్లా అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరానికి రెండు సార్లు ఎంపీగా విశేష సేవలందించిన ఉండవల్లి తనకు స్ఫూర్తి అన్నారు. నగరంలో ఈ నాలుగున్నర ఏళ్ళలో చేసిన అభివృద్ధిని చూసి మీ అభిప్రాయాలు, అలాగే మీ సంపూర్ణ మద్దతు కావాలని కోరారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, బ్రాహ్మణ ప్రముఖులు దూర్వాసుల సత్యనారాయణ పాల్గొన్నారు.

సారా కేసులో ఇద్దరి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: గోదావరిగట్టు ప్రాంతాలలో సారా విక్రయిస్తున్న తొర్రేడు గ్రామానికి చెందిన భీమరాజును అరెస్టు చేసి 20లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమణ తెలిపారు. సారా సప్లయి చేసిన కాటవరానికి చెందిన మణికంఠను అరెస్టు చేశామన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్వాలాతోరణం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక టి.నగర్‌లోని శ్రీబాలాత్రిపుర సుందరి అన్నపూర్ణ సమేత శ్రీవిశ్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తికపౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి జ్వాలాతోరణం వైభవంగా నిర్వహించారు. ఎండుగడ్డితో వెలిగించిన తోరణం కింద నుంచి మూడుసార్లు స్వామివారి పల్లకిని ఊరేగించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ నిడమర్తి దుర్గాశ్రీనివాస్, ధర్మకర్తలు, కార్యనిర్వహణాధికారి ఎం.శోభారాణి ఏర్పాట్లు చేశారు.

బొమ్మూరులో...

బొమ్మూరులోని శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో జ్వాలాతోరణం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఉమామార్కండేయేశ్వర స్వామి ఆలయం వద్ద..

సీటీఆర్ఐ: కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆదివారం గోదావరి గట్టున గల శ్రీ ఉమామార్కండేయేశ్వర స్వామి వారికి, స్వయంభూః పార్వతి మాతకు ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని, అమ్మవారిని పూలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నీలకంఠ చార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. దేవదాయ ధర్మదాయశాఖ భక్తుల దర్శనానికి అటంకం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం జ్వాలా తోరణం భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహణాధికారి ఆర్. శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించారు.



కార్తిక పౌర్ణమి సందర్భంగా కడియపులంక శివాలయంలో భక్తులు

కడియం: మండలంలోని శైవ ఆలయాల్లో కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. ఉపవాస దీక్షను పాటించిన మహిళలు సాయంత్రం ఆలయాలకు చేరుకుని ఆయా పూజల్లో పాల్గొన్నారు. మొక్కులు చెల్లించారు. కడియపులంక హరిహరమహాక్షేత్రం, కడియంలోని శ్రీ భ్రమరాంబికా మల్లేశ్వరాలయం, దుళ్ళలోని శ్రీ బాలాత్రిపురసుందరీ సమేత అగస్త్యేశ్వరాలయం, వేమగిరి, వీరవరం, జేగురుపాడు, మురమండ తదితర గ్రామాల్లోని ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. దుళ్ళ వంతెన సెంటరులో గల శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయం వద్ద కార్తిక దీపోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దాతలు, భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని కార్తిక దీపాలను వెలిగించారు. అంతకు ముందు వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. దుళ్ళ శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద కూడా కార్తిక దీపోత్సవం వైభవంగా జరిగింది.

నగరంలో మరిన్ని వినూత్న పార్కులు

ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగర వాసుల ఆరోగ్యం, ఆహ్లాదం, ప్రశాంతత కల్గించేలా నగరంలో అనేక పార్కులను అభివృద్ధి చేయనున్నట్టు ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. ఆదివారం కంబాల చెరువు పార్కును ఎంపీ భరత్‌రామ్ సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నగర అభివృద్ధిలో భాగంగా పార్కుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు తెలిపారు. సౌత్ ఇండియాలోనే కంబాల చెరువు పార్కు అద్భుతమైన పార్కుగా తీర్చిదిద్దామన్నారు. ప్రతీ ఒక్కరూ యోగా, మెడిటేషన్, వాకింగ్.. వీటిలో కనీసం ఒకటైనా రోజుకు అర్ధగంట కేటాయించి సాధన చేయాలన్నారు. గాంధీ పార్కును అభివృద్ధి చేసి డిసెంబరు 25 నాటికి వాకర్స్‌కు గిఫ్ట్‌గా అందజేస్తామన్నారు. లాలాచెరువు నుంచి క్వారీకి వెళ్ళే పార్కు వినూత్నమైన 'గ్లో గార్డెన్' పార్కుగా డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి కాబోతోందన్నారు. వీటితో పాటు సుమారు పదెకరాల విస్తీర్ణంలో సిటీ లెవెల్ పార్కు కూడా నగర వాసులకు అతి త్వరలోనే కానుకగా ఇవ్వబోతున్నట్టు తెలిపారు. హైదరాబాదు టాంక్ బండ్, నెక్లెస్ రోడ్డు మాదిరిగా గోదావరి బండ్ రోడ్డును తీర్చిదిద్దేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

టీడీపీ, జనసేన డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారు

ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ, జనసేన రాజకీయ డ్రామాలను ప్రజలంతా గమనిస్తున్నారని, సరైన సమయం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సోమవారం నుంచి లోకేష్ యువగళం పాదయాత్రను మళ్లీ ప్రారంభిస్తున్న విషయమై లోకేష్ నిజానికి పొలిటీషియనే కాదన్నారు. అతను చేసే పాదయాత్రను ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదని, స్పాన్సర్డ్ యాత్రగా అభివర్ణించారు. పాదయాత్ర అంటే వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి చేసిందని, ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు చేయాలన్నారు. తండ్రి చంద్రబాబు అరెస్టు అయ్యారని లోకేష్ తన పాదయాత్రని ఆపేసి ఢిల్లీ వెళ్ళాడని.. అది ఎందుకో తెలియదన్నారు. 2014–19 మధ్య సీఎంగా చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలేవీ అమలు చేయలేదని, ఏ ముఖం పెట్టుకుని మీ భవిష్యత్తుకు గ్యారంటీ అంటూ ప్రజలను ఓట్లు అడగడానికి వస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబును సీఎం చేయాలని తప్పిస్తే పవన్ కళ్యాణ్‌కు మరో ఆలోచన లేదన్నారు. నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, కంబాలచెరువు పార్కు అధ్యక్షుడు జీఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యక్షుడు యజ్ఞవరపు శ్రీను, కార్యదర్శి రేలంగి చంద్ర మోహన్, పార్టీ నేతలు మజ్జి అప్పారావు, బర్రే కొండబాబు పాల్గొన్నారు.

క్రీస్తు ఆశీస్సులు అందరిపై ఉండాలి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): క్రైస్తవుల ఆరాధ్య దైవం ఏసుక్రీస్తు దివ్య ఆశీస్సులు మెండుగా ప్రతీ ఒక్కరిపైనా ఉండాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీచీఫ్‌విప్ , రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆదివారం బైబిల్ మిషన్ రెవరెండ్ డాక్టర్ ఎస్ జె షారోన్ కుమార్ ఆధ్వర్యంలో ఐఎల్‌టీడీ పై ఓవర్ ప్రక్కన రైల్వే క్రీడా మైదానంలో ఘనంగా 'రాకడ పండుగ ఆరాధన'ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ మార్గాని భరత్ హాజరై క్రైస్తవ విశ్వాసులను ఉద్దేశించి మాట్లాడారు. క్రైస్తవుల శ్మశాన వాటికకు కలెక్టరేట్ వెనుక సుమారు ఆరెకరాల భూమిని మంజూరు చేసినట్టు తెలిపారు. ప్రభువు తన చేత ఆ పని చేయించాడని, ఎంతో తృప్తిగా, సంతోషంగా ఉందని ఎంపీ భరత్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ముఖ్య వాక్యోపదేశకులుగా హాజరైన బైబిల్ మిషన్ ప్రెసిడెంట్ అపోస్తులు రెవరెండ్ పి సజీవరావు మాట్లాడుతూ ఏసుక్రీస్తు మొదటి రాకడను గుర్తుచేసుకుంటూ క్రిస్మస్ పండుగను జరుపుకుంటామని, ఆయన రెండవ రాకడ కొరకు నిరీక్షిస్తూ బైబిల్ మిషన్ వారు ఈ రెండవ రాకడ పండుగలను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. రెవరెండ్ డాక్టర్ ఎస్.జె.షారోన్ కుమార్, రెవరెండ్ ఎస్ సుధన్ షారోన్ ఎంపీ భరత్‌కు ప్రభువు దీవెనలు అందజేశారు. క్రైస్తవ భక్తులకు రాకడ విందును ఏర్పాటు చేశారు.



ఎంపీ భరత్‌రామ్‌కు ప్రభువు దీవెనలు అందిస్తున్న రెవరెండ్ షారోన్‌కుమార్

రాజ్యాంగ విలువలు కాపాడాలి

ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమమేంద్రవరం సిటీ: భారతదేశ రాజ్యాంగం మొత్తం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగమని వైఎస్సార్ ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. ఆదివారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద ఎంపీ భరత్‌రామ్, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ భారత దేశ రాజ్యాంగ విలువలను ప్రతీ ఒక్కరూ కాపాడాలన్నారు. ప్రధాని మోదీ 2047 నాటికి భారతదేశం విశ్వ గురువు కావాలని ఆకాంక్షిస్తున్నారని ఆ దిశగా ప్రతీ ఒక్కరి అడుగులు వేయాలన్నారు. సామాజిక న్యాయం, సాధికారతను గుర్తు చేసుకుంటూ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని కేంద్రం పిలుపునిచ్చిందని గుర్తు చేశారు. పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నాయకులు కాటం రజనీకాంత్,నక్కా నగేష్ పాల్గొన్నారు.

రుడా కార్యాలయంలో..

రాజమహేంద్రవరం సిటీ: భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరునికి స్వతంత్ర భారతదేశంలో జీవించడానికి సమాన హక్కులను కల్పించిందని రుడా పేర్కొన్నారు. ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రుడా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి వైస్ చైర్మన్ బి.బాలస్వామి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ వివక్ష లేకుండా ప్రజలందరూ హక్కులు పొందేలా రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. రుడా సెక్రటరీ జి.శైలజవల్లి, రుడా ప్లానింగ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్, రుడా ఈఈ జి.నాగేశ్వరి పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో...

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఆర్ట్స్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో, రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత హాజరై మాట్లాడుతూ ప్రతి ఏడాది నవంబర్ 26న జాతీయ న్యాయ దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవాలని జరుపుకుంటున్నామన్నారు. దేశంలోని పౌరులు, పరిపాలన వ్యవస్థలు, రెవెన్యూ, న్యాయ వ్యవస్థలు, పోలీసు వ్యవస్థ, రాజ్యాంగ, రాజ్యాంగేతర సంస్థలు, కంపెనీలన్నీ రాజ్యాంగం ప్రకారం నడుచు కోవాలన్నారు. తొలుత కళాశాల ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి, 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.మాధురి, పి.బాబ్జీ, జోన్ 1–2 ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ చప్పిడి కృష్ణ, సీనియర్ న్యాయవాది పి.శ్రీనివాసరావు, కాలేజీ ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి

కోటగుమ్మం వద్దనున్న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. డీవైఈవో ఈవీబీఎస్ నారాయణ, డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌లు వి.వెంకట్రాజు, ఛాయాదేవి, అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ కార్యాలయంలో..

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక మోరంపూడిలోని జీవిత బీమా సంస్థ రాజమహేంద్రవరం డివిజనల్ కార్యాలయంలో ఆదివారం అధికారులు,ఉద్యోగులు భారత రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ చేశారు. ఎల్ఐసీ చైర్‌పర్సన్ సిద్ధార్థ మహంతి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞా కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెటింగ్ మేనేజర్ కళ్యాణ్, గుబ్బల రాంబాబు, కోదండరాం, సమ్మతం గన్నయ్య, పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో

కాతేరులో వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామరాజ్‌నాయక్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సం నిర్వహించారు.

కడియం మండలంలో..

కడియం: మండలంలో పలు చోట్ల భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పెద్దాపురం నియోజకవర్గం పరిశీలకులు గిరజాల వీర్రాజు (బాబు) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రాజ్యాంగం ప్రాముఖ్యతను వివరించారు. పార్టీ నాయకులు శాకా పట్టాభి, బట్టు చిన్ని పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.రత్నకుమారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, చంద్రరావు పాల్గొన్నారు. కడియపులంకలో స్థానిక నాయకులు చీకట్ల మాచరయ్య ఆధ్వర్యంలో భార రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కడియం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, నాయకులు బోడపాటి మూర్తి, ఆరేటి వెంకట్రావు, ఈలి శ్రీనివాసు, బొచ్చే సందీప్ పాల్గొన్నారు. దుళ్ళలో సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉపసర్పంచ్ తోకల శ్రీనివాసరావులు అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. మురమండలో అయినవిల్లి వేంకటేశ్వరరావు, మెల్లిమి గంగరాజు, గారపాటి బుజ్జిబాబు రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: ధవళేశ్వరం బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తలారి వరప్రసాద్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పెయ్యల రాజేష్ విచ్చేశారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు తోరాటి ప్రభాకర రావు, వైఎస్సార్ సీపీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ పాల్గొన్నారు. స్థానిక సాయిబాబా గుడి సెంటర్ వద్ద వైఎస్సార్ సీపీ నాయకురాలు పసుపులేటి దేవి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. లాక్‌లైన్ క్వార్టర్స్ వద్ద అంబేడ్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు మోర్త పావనమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు.

రూరల్‌లో..

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులో మేడపాటి సద్గుణ రామరెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ యువజన సంఘం నేతృత్వంలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను ,వైఎస్సార్ సీపీ నాయకులు యెనుముల త్యాగరాజు ,ఎలుగొండ చెల్లాయమ్మ తోడేటి రాజా, దాకే శ్రీను పాల్గొన్నారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. శాటిలైట్ సిటీలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కలిశెట్టి అచ్చంనాయుడు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మాజీ ఉపసర్పంచ్‌లు బొమ్మశ్రీను, కడవకొల్లు వెంకటరమణారావు, బత్తిన అప్పారావు పాల్గొన్నారు. ఐఎల్‌టీడీ సెంటర్‌లో 18వ డివిజన్ వైఎస్సార్ సీపీ నేతలు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

రాజ్యాంగం అందరి కోసం

ప్రకాశం నగర్: అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగంలో 395 ఆర్టికల్స్ ఉంటే వాటిలో 8 నుంచి 10 ఆర్టికల్స్ మాత్రమే బీసీ,ఎస్సీ ఎస్టీల కోసం ఉన్నాయని మూల్ నివాసీ సంఘ్ జాతీయ అధ్యక్షుడు నయనాల కృష్ణారావు చెప్పారు. బామ్ సెఫ్, మూల్ నివాసీ సంఘ్,ఎం.కె.కె.ఎం.సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరంలో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గోకవరం బస్టాండ్ అంబేడ్కదర్ విగ్రహం వద్ద నుంచి రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. ఓఎన్జీసి మాజీ అసెట్ మేనేజర్ డిఎం.ఆర్.శేఖర్ ర్యాలీని ప్రారంభించారు.త్రీటౌన్, పుష్కర ఘాట్, మార్కండేయ స్వామి గుడి మీదుగా గోదావరి గట్టున ఉన్న పూలే విగ్రహం వద్దకు ర్యాలీ చేరుకుంది.

బామ్ సెఫ్ కేంద్ర కమిటీ సభ్యురాలు డాక్టర్ పితాని కోమల జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎంకెకెఎం జాతీయ అధ్యక్షుడు కె.తిలక్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో నయనాల కృష్ణారావు మాట్లాడారు.



మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్



ధవళేశ్వరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రుడా కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలో వైస్ చైర్మన్ బాలస్వామి



డీవైఈవో కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



కడియంలో పుష్పాంజలి ఘటిస్తున్న బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కామేశ్వరరావు, గిరజాల బాబు తదితరులు



బొమ్మూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు